వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్యం,ఘన వ్యర్థాలు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్థానిక భీమవరం మున్సిపల్ కార్యాలయం నందు సమావేశమై పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్యం, ఘన వ్యర్థాలు నిర్వహణపై ప్రజా ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడానికి ఆదేశాలు జారీ చేశారు. 120 మైక్రాన్లకన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వాడకంపై నిషేధం ఉన్న కారణంగా వ్యాపారస్తులు, వినియోగదారుల ప్లాస్టిక్ వినియోగంపై ఆలోచన చేయాలని, ప్లాస్టిక్ కవర్ల స్థానంలో జ్యూట్ బ్యాగులను, పేపర్ కవర్స్ ను వినియోగించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ లేదా 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ ను వినియోగించిన వారికి పెనాల్టీలు విధించడం వలసిందిగా ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ వస్తువులపై తయారీ లేదా విక్రయదారులే సదరు ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగం చేయడం, శాస్త్రీయ పద్ధతిలో వాటిని ప్రాసెస్ చేసే విధానంలో ప్రథమ బాధ్యతను కలిగి ఉంటారన్నారు. రానున్న రెండు వారాల్లోపు పట్టణంలో దుకాణదారులు వారి నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలను వారి ద్వారానే సక్రమ పద్ధతిలో పునర్వినియోగం లేదా ప్రాసెస్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వ్యర్థాలను కలిగి ఉన్న వారిపై భారీ జరిమానాలను విధించడమే కాకుండా, వారి షాపుల లైసెన్సు రద్దు చేయడం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, పురపాలక సంఘం ఇంజనీర్లు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

క్లుప్తంగా

కాళ్లలో చెకుముకి సైన్స్ సంబరాలు


చెకుముకి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కాళ్ల: జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా నిర్వహించబడే పాఠశాల స్థాయి చెకుముకి పోటీని బుధవారం నిర్వహించారు. కాళ్ల మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. చెకుముకి కాళ్ల మండల కన్వీనర్ శ్రీ బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి మాట్లాడుతూ విద్యార్థులు చెకుముకి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన వారు అక్టోబర్ 1న మండల స్థాయి చెకుముకి సంబరాల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

కాళ్లకూరులో పవిత్రోత్సవాలు ప్రారంభం


స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం సప్త నదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ కాందూరి వెంకట రమణాచార్యులు బ్రహ్మత్వమున వేదమంత్రాల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశ్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవాచన, దీక్షా ధారణ, అంకురార్పణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ గోష్ఠి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

వివాదాస్పద ఆలయ గోపుర నిర్మాణ చర్చలు విఫలం


రాజీ చేసేందుకు వచ్చిన అధికారులు

భీమవరం అర్బన్: మండలంలోని గూట్లపాడు గ్రామంలో వివాదాస్పద శ్రీ రాజ రాజేశ్వరి ఆలయ గోపుర నిర్మాణంపై డీపీఓ విక్టర్, తహసీల్దార్ రావి రాంబాబు, ఈఓపీఆర్డీ నామేశ్వరరావు అధికారుల సమక్షంలో చర్చలు బుధవారం విఫలమయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు, బాధిత కుటుంబ సభ్యులు మధ్య రాజీ చేసేందుకు అధికారులు చేపట్టిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇరు వర్గాల వారు మాట పట్టింపు విడవకపోవడంతో గొడవలు జరిగే ఆస్కారం ఉందని అధికారులు వెళ్లిపోయారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవ పూజలు


కొప్పర్రు శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రులో ఉన్న అన్నపూర్ణ, పార్వతి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిచారు. ఆలయ అర్చకులు మల్లాది జోగయ్య శర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కడలి చంద్రరావు, ప్రబలదేవి, నర్సింహరావు-లావణ్య దంపతులు వనగ్రహ, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు.

మొగల్తూరులో భక్తి ర్యాలీ


మొగల్తూరులో భక్తి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: తిరుమల తిరుపతిలో శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఆరోపణలు రావడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. తిరుమల తిరుపతి పవిత్రతను కాపాడాలని కోరుతూ మొగల్తూరు వేంకటేశ్వర స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో బుధవారం మొగల్తూరులోభక్తి ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని హిందూ భక్తులంతా పాల్గొన్న ఈ భక్తి ర్యాలీ స్థానిక వేంకటేశ్వర స్వామి గుడి వద్ద ప్రారంభమై పెంకేవారి కాంప్లెక్స్ వరకు సాగింది.

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలి


చెకుముకి పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో సైన్స్ కొత్త పుంతలు తొక్కుతుందని విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలని జిల్లా చెకుముకి సైన్స్ కన్వీనర్ రేపాక వెంకన్నబాబు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరులోని డీఎన్నార్ జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం పాఠశాల స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత 34 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ ఉంటుందని దానిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ చెకుముకి పోటీలు విద్యార్థుల్లో సైన్స్‌పై అభిరుచిని, ఆసక్తిని, శాస్త్రీయ దృక్పథాన్ని కలుగజేస్తాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. పాఠశాల చెకుముకి కన్వీనర్ ఎస్.దుర్గా వర ప్రసాద్ మాట్లాడుతూ జి.రవికిరణ్, వి.ఎలిజా నవోమి, బి.సంతోష్‌కుమార్ మండలస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.మెర్సీ నిర్మల కుమారి, జి.నర్మద, డి.అనురాధ, కె.రాజేష్ కుమార్ రాజు, జీఎస్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల రిజర్వేషన్ 50 శాతానికి పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న వేండ్ర వెంకటస్వామి

భీమవరం(ప్రకాశం చౌక్): గీత కార్మికులగా ఉన్న గౌడ, శెట్టిబలిజ,శ్రీశైన,యాత వర్గాలకు ప్రభుత్వం ప్రకటించిన మద్యం షాపుల కేటాయింపు రిజర్వేషన్‌ను 10 శాతం నుంచి 50 శాతంకు పెంచాలని గౌడ, శెట్టిబలిజ శ్రీశైన,యాత సంఘం జిల్లా అధ్యక్షులు వేండ్ర వెంకటస్వామి అన్నారు. బుధవారం భీమవరంలో గౌడ శెట్టి బలిజ, శ్రీశైన,యాత సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ గీత కార్మికులగా ఉన్న గౌడ శెట్టిబలిజ, శ్రీశైన, యాత వర్గాలకు ప్రభుత్వం మద్యం షాపుల కేటాయింపులో రిజర్వేషన్ కల్పించనందనకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. అయితే 10 శాతం నుంచి రిజర్వేషన్ 50 శాతానికి పెంచాలన్నారు. అలాగే దరఖాస్తు ఫీజు రెండు లక్షల నుంచి రూ.లక్షకు తగ్గించలన్నారు. మద్యం షాపుల కేటాయింపు, నిర్వహణలో ఎవరికీ ఎటువంటి ముడుపులు ఇచ్చేపరిస్థితి లేకుండా పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకొవాలన్నారు. సంఘస్తులు మండల, పట్టణ కమిటీలులగా ఏర్పాడి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ షాపులను దక్కించుకునేలా సమష్టిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, పాక సత్యనారాయణ, జుత్తిగ నాగరాజు, కట్టా కనకరాజు, చెబోలు రామకృష్ణ, చింతపల్లి గురుప్రసాద్, గుబ్బల నారాయణమూర్తి, గుబ్బుల నాగరాజు, కాండ్రేగుల నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో యూత్ హాస్టల్స్ వార్షికోత్సవం


భీమవరంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్నదృశ్యం

భీమవరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఎఐ) భీమవరం యూనిట్ 35వ వార్షికోత్సవాలు డిసెంబర్ 15న త్యాగరాజు భవనంలో నిర్వహిస్తున్నట్లు యూనిట్ చైర్మన్ ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ, కార్యదర్శి నందమూరి రాజేష్ బుధవారం చెప్పారు. వేడుకలకు కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. అసోసియేసన్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు మంతెన వెంకటనర్సింహ సీతారామరాజు (చిలుకూరి నరసింహం) అధ్యక్షతన నిర్వహించే వేడుకల్లో నేషనల్ చైర్మన్ మనోజ్ జోరీ, వివిధ రాష్ట్రాలకు చెందిన చైర్మన్‌లు, కార్యదర్శులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసవర్మను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో బోణం పాండురంగారావు, కట్రెడ్డి సత్యనారాయణ, పేరిచర్ల లక్ష్మణవర్మ, జానపాటి మధుసూదనరావు, అడ్డగర్ల గాంధీ, తాళ్లపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులతో డీపీవో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో విక్టర్

ఉండి: మండల ప్రత్యేకాధికారులతో జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఎం ఆవాస్ యోజన కార్యక్రమంలో గ్రామాల్లో రూఫ్ లెవల్ స్థాయిలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం అక్టోబర్‌లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 28న మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో లేఅవుట్ల లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి, ఇళ్ల నిర్మాణంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్వర్ణాంధ్ర 2047 వంటి అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రవీంద్ర, గృహ నిర్మాణ ప్రత్యేకాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు సన్నద్ధం కావాలి


కొమరాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ నిమ్మల శ్రీనివాస్

భీమవరం అర్బన్: దాళ్వా సాగుకు సన్నద్ధం కావాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని కొమరాడ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ కొమరాడ లోతట్టు ప్రాంతం కావడంతో కొద్ది ఆయకట్టులో మాత్రమే సార్వా సాగు చేపట్టారన్నారు. ముందస్తు దాళ్వాకు సన్నాహాలు చేపట్టాలన్నారు. డ్రెయిన్ శాఖ ఏఈ ప్రకాష్ మాట్లాడుతూ వర్షపు నీరు ఎప్పటికప్పుడు దిగువకు ప్రవహించే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలువురు రైతులు సాగులో నెలకొన్న సమస్యలపై వివిధ శాఖల అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి పి. పుండరీబాబు, రైతులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కు ఘన నివాళి


భీమవరంలో ఆర్ఎస్ స్మంసరణ సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

భీమవరం: ప్రజా ఉద్యమాలకు, పోరాటాలకు రథసారథి వంటి నాయకులను కోల్పోవడం సీపీఎంకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం సీనియర్ నేత ఆర్ సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణంరావు, ఫార్వర్డ్ బ్లాక్ భీమవరం జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి


విష్ణు కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్వామి చిదురుపానందాజీ

భీమవరం: విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాలు ఏర్పర్చుకుని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని నోయిడాలోని చిన్మయమిషన్‌కు చెందిన స్వామి చిదురుపానందాజీ అన్నారు. భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎక్స్‌ప్లోరింగ్ పర్సనాలిటీస్ అండ్ హ్యూమన్ వాల్యూస్ అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎవరి వ్యక్తిత్వానికి తగినట్లుగా మలుచుకోవాలని, మానవతా విలువలు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల జీడీడీ డైరెక్టర్ జె ప్రసాదరాజు, డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ ఆఫైర్స్ అండ్ అడ్మిన్ పి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువు సమాజానికి వెలుగు


పూలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఏఎస్సై ఎస్ మార్లింగం

పాలకొల్లు అర్బన్: ఆడపిల్లలు చదువుకుంటే సమాజానికి వెలుగునిస్తుందని పట్టణ ఏఎస్సై ఎస్.మార్లింగం అన్నారు. మండలంలోని పూలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడపిల్లలను చదవనిద్దాం-ఆడపిల్లలను ఎదగనిద్దాం కార్యక్రమంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై మార్లింగం మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిని క్రమశిక్షణతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి, హెచ్ఎం జీటీవీ కుమార్, శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు


శివదేవునిచిక్కాలలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పాలకొల్లు అర్బన్: గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన పిల్లలు పుడతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. మంగ అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని శివదేవునిచిక్కాలలో ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు బుధవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆశీర్వదిస్తూ గర్భిణులకు పసుపు, కుంకుమ, గాజులు, పూలు, చీర, జాకెట్, పండ్లు అందజేశారు. అలాగే ఆకు కూరలు, రాగులు, జొన్నలు, సజ్జలతో తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పులఖండం సత్యవేణి, ఎస్ఎన్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ

నరసాపురం: విద్యార్థులు ర్యాగింగ్ లాంటి విషసంస్కృతుల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోకూడదని నరసాపురం డీఎస్పీ ఎన్‌బీ మురళీకృష్ణ సూచించారు. బుధవారం పట్టణంలోని శ్రీ సూర్యా కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. చెడు వ్యసనాలు, చెడు సంస్కృతులపై ఆకర్షణ పెంచుకుంటే జీవితంలో పతనం తప్పదన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. ఉమెన్, బాలికలపై అనుచితంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం ప్రకారం శిక్ష పడుతుందని హెచ్చరించారు. యువతులు, బాలికలు తమను ఎవరైనా వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం టౌన్ సీఐ బి.యాదగిరి, ఎస్సై జయలక్ష్మి, కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షంతో ఇక్కట్లు


యలమంచిలి: ఏనుగువానిలంక పాత హరిజనపేటలో వర్షపు నీటిలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు


మొగల్తూరు: గాంధీ బొమ్మల సెంటర్ నుంచి స్టేషన్‌కు వెళ్లే రహదారిలో నిలిచిన వర్షపునీరు

యలమంచిలి: ఏనుగువానిలంక గ్రామ పరిధిలోని పాత హరిజనపేటలో కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్లు ముంపుకు గురవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం తగ్గినా రోడ్డు పక్కల మురుగు నీరు నిల్వ ఉండి, నీరంతా పచ్చ రంగులోనికి మారుతుందని స్థానికులు వాపోతున్నారు. మురుగు నీటిలో దోమలు విపరీతంగా పెరగడంతో కాలనీ వాసులంతా జ్వరాలతో బాధ పడుతున్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు పంచాయతీలో వినతిపత్రం ఇచ్చిన స్పందించడం లేదని స్థానికులు పాలపర్తి సందీప్‌కుమార్, మనోజ్‌కుమార్, రాజు ఆరోపించారు. ఈ వర్షపు నీటిలోనే నడుచుకుంటూ విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలు పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తున్నారని, ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు చెప్పారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగు సమస్య తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పల్లపు ప్రాంత్రాలు మునక

మొగల్తూరు:: బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనంతో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో గత రాత్రి నుంచి వర్షం కురుస్తుంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు సుమారు 22.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో మొగల్తూరులోని పలు పల్లపు ప్రాంతాలతోపాటు గొల్లగూడెం, స్టేషన్ రోడ్, కోట రోడ్డు, తదితర ప్రాంతాలలో రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఫార్మాసిస్టులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

భీమవరం: ఫార్మాసిస్టులకు కొత్తసాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని దానికోసం నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీసీఐ అధ్యక్షుడు డాక్టర్ మొంటు కుమార్ పటేల్ అన్నారు. భీమవరం విష్ణు ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విష్ణు ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మసిస్ట్ ట్రెన్ ది ట్రైనర్ అనే ఆన్‌లైన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 12 వేల మంది ఫార్మసిస్టులకు శిక్షణ ఇస్తున్నామని సౌత్ ఇండియాలో విష్ణు ఫార్మసీ కళాశాలలోనే మొట్టమొదటగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కేఎస్ నటరాజ్, క్యాంపస్ డైరెక్టర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

1న శాంతి ర్యాలీ

భీమవరం: మహాత్మాగాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 1న అహింస-శాంతి ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం పట్టణంలోని క్విట్ ఇండియా స్థూపం వద్ద 1వ తేది ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రదర్శనలో గాంధీజీ వేషధారణతో విద్యార్థుల శాంతిసేన ర్యాలీ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీస్మారక నిధి రాష్ట్ర చైర్మన్ కేసీపీ గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ప్రసాదరాజు తెలిపారు.

27 నుంచి ఆక్వా ఎక్స్‌పో

ఉండి: వాండ్రం పరిధిలో ఈనెల 27, 28 తేదీల్లో కోట్ల ఫంక్షన్ హాల్‌లో ఇండియా ఇంటర్నేషనల్ ఆక్వాకల్చర్ ఎక్స్‌పో 2024 ఎగ్జిబిషన్, కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు ఎంఏ నజర్ బుధవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వేధింపులపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: స్థానిక మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మహిళలు పని చేస్తున్న ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న జెండర్ సెన్సిటైజేషన్, సెక్సువల్ హెరాస్మెంట్లు, వాటిని అరికట్టేందుకు తీసుకునే విధివిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోక్సో కోర్టు హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ మహిళలు వేధింపులకు గురైతే తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

పాలకోడేరు: పెండింగ్ కేసులను కాలయాపన లేకుండా సత్వరమే పరిష్కరించాలని భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆయన బుధవారం పాలకోడేరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

యలమంచిలి ఎంపీడీఓగా ప్రేమాన్విత

యలమంచిలి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నందిపాటి ప్రేమాన్విత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఉంగుటూరు ఎంపీడీఓగా పని చేస్తూ బదలీపై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన చివటం త్రిశూలపాణి మొగల్తూరు ఎంపీడీఓగా బదలీపై వెళ్లారు. తొలిసారి కార్యాలయానికి వచ్చిన ప్రేమాన్వితకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.